క్లుప్తంగా

నేడు అన్నసమారాధన

బిక్కవోలు: గ్రామంలోని జువ్వలదొడ్డిలో వెలిసిన సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 11 గంటల నుంచి మాంసాహారంతో అన్నసమారాధన జరుగుతుందన్నారు.

వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పెదపూడి: సంపర గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవల్లి హనుమంతాచార్యులు విశేష పూజలు చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, తులసి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హోమియోపతి వైద్యశిబిరం



శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సీతానగరం: వంగలపూడి పంచాయతీ సమీపంలోని రామాలయం వద్ద అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో శనివారం హోమియోపతి వైద్యశిబిరం నిర్వహించారు. వంగలపూడి, సింగవరం గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు డాక్టర్ షేక్ అహ్మద్ వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ సుల్తాన్ మాట్లాడుతూ హజ్రత్ మీర్జా గులామ్ అహ్మద్ పంజాబ్‌లోని ఖాదియాన్ నగరంలో 1889లో కమ్యూనిటీని స్థాపించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మహ్మద్ సిరాజ్, సభ్యులు సజీల్ గోరి, జావిద్, మసీదు అధ్యక్షుడు షేక్ ఖాసిం ఫారూఖ్, మహ్మద్ క్బర్, షేక్ అహ్మద్ అలీ, రజాక్, మసీదు గురువు మహ్మద్ అక్బర్ పాల్గొన్నారు.


కృష్ణారెడ్డి కుటుంబానికి పలువురి పరామర్శ



బాపాయమ్మ చిత్రపటానికి అంజలి ఘటిస్తున్న ప్రముఖులు

పెదపూడి: అనపర్తి మండలం రామవరం ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులను శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు. ఆయన తల్లి బాపాయమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భగవాన్ రెడ్డి, పైన ఎంపీటీసీ సభ్యుడు సుధాకర్, పెడపర్తి సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ, కొలమూరు సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, అచ్యుతాపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ గుండా ఈశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పి.నాగేంద్ర.. రామవరం గ్రామంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాపాడితేనే ప్రగతి

- పశుసంరక్షణకు జాగ్రత్తలు అవసరం
- టీకాలతో వ్యాధుల నియంత్రణ
- పాడి రైతులకు పశువైద్యాధికారుల అవగాహన



ములకల్లంకలో పాడి రైతులకు పశువుల మందులు అందిస్తున్న పశుసంవర్థకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు (ఫైల్)

సీతానగరం: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వ్యవసాయంతో పాటు పశుపోషణ చాలా అవసరం. అదనపు ఆదాయం కోసం పశువులను మేపుతారు. వీటితో పాటు గొర్రెల, మేకలను కూడా ఎక్కువగా పెంచుతారు. వ్యవసాయం ద్వారా సీజన్‌కు అనుగుణంగా డబ్బులు వస్తాయి. పాడి పరిశ్రమతో ప్రతి నెలా ఎంతో కొంత ఆదాయం లభిస్తుంది. తద్వారా వారి జీవనం ముందుకు సాగుతుంది. అయితే పశువుల పెంపకం లాభదాయకంగా ఉండాలంటే వాటిని వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవాలి. ఎందుకంటే అనేక సీజనల్ వ్యాధులు దాడి చేస్తూ ఉంటాయి.

పశువులను సంరక్షించాలి

పశువులను వ్యాధుల నుంచి సంరక్షించినప్పుడే పాడి పరిశ్రమ ప్రగతి సాధ్యమవుతుంది. గత ప్రభుత్వం నుంచి పాడి పరిశ్రమపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, పశు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా కొనసాగుతున్నాయి. పాడి రైతులు తమ పశువులను ఈ శిబిరాలకు తీసుకువచ్చి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అలాగే ఉచితంగా అందించే మందులను తీసుకువెళ్లవచ్చు. శిబిరానికి వచ్చిన ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలను పశు వైద్యులు వెంటనే పరీక్షించి, వైద్యం అందిస్తారు. తేలికపాటి శస్త్ర చికిత్సలు చేయడం, ఎదకు రాని, చూలు కట్టని, ఇతర గర్భకోశ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, తగిన వైద్యం అందిస్తున్నారు. ఎదలో ఉన్న పశువులను గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయడం, చూడి పరీక్షలు నిర్వహించి శాస్త్రీయ సూచనలను పాడి రైతులకు ఇవ్వడం జరుగుతోంది. నియోజకవర్గంలో ఈనెలాఖరు వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నారు.

పశుసంపద వివరాలు

మండలం	పశువులు	గేదెలు	గొర్రెలు	మేకలు
కోరుకొండ	7,770	15,395	897	4076
రాజానగరం	10,224	21327	65,531	6,131
సీతానగరం	3,115	11,622	3,708	3,467

నట్టల మందు

పశువులు, దూడలు, సన్న జీవాల (మేకలు, గొర్రెలు)కు నట్టల మందును తాగించాలి. దీనివల్ల అవి బరువు పెరిగి ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. పాడి పశువులకు నట్టల నివారణ మందు పట్టించడం వల్ల పాల ఉత్పత్తితో పాటు పునరుత్పత్తి మెరుగవుతుంది.

గర్భకోశ వ్యాధులు

గర్భకోశ వ్యాధులను గుర్తించి, చికిత్స చేయవచ్చు. పశువులు చూడు కట్టకపోవడం, సకాలంలో ఎదకు రాకపోవడం వంటివి గర్భకోశ వ్యాధులు అంటారు. ఇటువంటి పశువులకు మినరల్ మిక్చర్ ఆహారంగా అందిస్తారు. మూడు రోజుల చికిత్స ద్వారా గర్భకోశ వ్యాధులను నివారించవచ్చు.

అవగాహన అవసరం



పశువులకు వచ్చే వ్యాధులు, వాటి సంరక్షణపై పాడి రైతులకు అవగాహన అవసరం. పశువులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పశు సంపద సమృద్ధిగా ఉంటుంది. గ్రామాల్లో జరుగుతున్న ఆరోగ్య శిబిరాలకు పాడి రైతులు తమ పశువులను తీసుకురావాలి. వాటికి వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. అలాగే పశువుల మందులను కూడా అందిస్తున్నాం. ఈ సేవలను పాడి రైతులు వినియోగించుకోవాలి.

– డాక్టర్ ఎ.ఫణీంద్ర, మండల పశువైద్యాధికారి, చినకొండేపూడి

దొమ్మ వ్యాధి టీకాలు

దొమ్మ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేస్తారు. పశువులు మేత తినక పోవడం, పాలు తగ్గడం, గొంతు వద్ద వాపు వంటి లక్షణాలు కలుగుతాయి. దొమ్మ వ్యాధి నివారణకు ముందుగా టీకాలు వేస్తారు. పాడి రైతులు తమ పశువులకు వీటిని తప్పకుండా వేయించాలి.

వ్యాధి నిరోధక టీకాలు

పశువులు, జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించడం అత్యంత అవసరం. అన్ని గ్రామాల్లో సామూహికంగా పశువులకు వీటిని ఉచితంగా అందిస్తున్నారు. గొర్రెలు, మేకలకు బొబ్బ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నారు. తద్వారా సన్న జీవాలలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల, పునరుత్పత్తి సామర్థ్యం మెరుగుపడుతుంది. కోళ్లకు కూడా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారు.

వివిధ పథకాలు

పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే విధానంలో భాగంగా అనేక పథకాలు అమలవుతున్నాయి. గోకులం, బహువార్షిక పశుగ్రాస క్షేత్రాలు, పశు బీమా, రాయితీపై ఇన్‌పుట్స్ సరఫరా, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, లింగనిర్ధారిత వీర్యం, పిండ మార్పిడి పరిజ్ఞానం వంటి పథకాలు ఉన్నాయి.

కాటవరంలో పశువైద్యశిబిరం



కాటవరంలో పాడి రైతులకు పశువుల మందులు అందిస్తున్న ఎంపీటీసీ వెంకట్రావు

సీతానగరం: పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో కాటవరంలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 46 పశువులు, 250 జీవాల (మేకలు, గొర్రెలు)కు మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎ.ఫణీంద్ర వైద్యసేవలు అందించారు. కాటవరం, జాలిమూడి గ్రామాలకు పశువులకు వైద్యం అందించారు. వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ తాడేపల్లి వెంకట్రావు, టీడీపీ నాయకుడు చిట్టూరి రంగారావు తదితరుల చేతుల మీదుగా పాడి రైతులకు పశువుల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏ ఆదిలక్ష్మి, ఏహెచ్ఏలు బుజ్జమ్మ, సోశీల్య, వెంకటేష్, అల్లు శ్రీనివాస్, అంగర సాయి, గోపాలమిత్ర అంగర రమణ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



కైకవోలులో వర్మీ కంపోస్ట్‌ను పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లోని చెత్త నుంచి సంపద తయారు కేంద్రాలను సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఈవోపీఆర్డీ ఎం.సత్యనారాయణ రెడ్డి అన్నారు. కుమారప్రియం, కైకవోలు, గంగ్రేడు గ్రామాల్లోని కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరు చేసే విధానం, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయితీలకు అదనపు ఆదాయం తీసుకువచ్చే ఈ కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్మీకంపోస్టును రైతులకు అనువైన ధరకు విక్రయించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య మెరుగునకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు ఎస్వీ స్వామి, లక్ష్మీనారాయణ, యాళ్ల ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అధిక దిగుబడుల దిశగా అడుగులు



ఏరువాక కేంద్రంలో మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు శివన్నారాయణ

రాజానగరం: రైతులు సాగు ఖర్చులను తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేయాలని, అందుకు అవసరమైన సాంకేతిక విజ్ఞానాన్ని అందించడానికి సమష్టి కృషి ఎంతో అవసరమని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రాన్ని శనివారం సందర్శించిన ఆయన.. కేంద్రం పనితీరును నిశితంగా పరిశీలించి, ఆ సమయంలో అక్కడ ఉన్న రైతులు, వ్యవసాయ విద్యార్థులకు సూచనలిచ్చారు. మినీకిట్లు, విత్తనాల పంపిణీ, శిక్షణ, వ్యవసాయ సలహాలు తదితర కార్యక్రమాల తీరును కూడా పరిశీలించారు. మరిన్ని నూతన సాంకేతిక పోకడలతో జిల్లా రైతాంగానికి వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల సమన్వయంతో సేవలు అందించాలన్నారు. అనంతరం రైతులు, వ్యవసాయ విద్యార్థులు వెలిబుచ్చిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మనుషుల అక్రమ రవాణాను అరికట్టాలి



శిక్షణలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం వరలక్ష్మి

రంగంపేట: ప్రపంచంలో మనుషుల అక్రమ రవాణా అతి పెద్ద నేరంగా ఉందని, దాన్ని అరికట్టడానికి కృషి చేయాలని రంగంపేట హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి పిలుపు నిచ్చారు. ఆ పాఠశాలలో శనివారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ టి.శ్రావ్యశృతి ఆధ్వర్యంలో నిర్వహించే రెండు రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన కల్పించి, అప్రమత్తంగా ఉంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బానిసత్వంతో కూడిన శ్రమ, లైంగిక వ్యాపారం, శరీర అవయవాల మార్పిడికి మనుషులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. శ్రావ్య శృతి మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ 21 ఏళ్లుగా పద్మశ్రీ డాక్టర్ సునీతా కృష్ణన్ ఆధ్వర్యంలో సుమారు 28,200 మంది ఆడ పిల్లలను రక్షించిందన్నారు. అలాగే సైబర్ నేరాలు నిరోధించడానికి 1930 అనే టోల్ ఫ్రీ నంబర్‌ను ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం పవర్ ప్రజెంటేషన్ ద్వారా మానవ అక్రమ రవాణా నిరోధం, బాలికల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్తలు ఎల్.అనిల్ కుమార్, జె.సుప్రియ, కె.చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఐఓసీఎల్ సిబ్బంది మాక్ డ్రిల్



పారాదీప్ నుంచి హైదరాబాద్ వెళ్లే పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ అధికారులు



రాజవరంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఐఓసీఎల్ సిబ్బంది

మధురపూడి: ఐఓసీఎల్ పైప్‌లైన్ ద్వారా సరఫరా జరిగేటప్పుడు అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎదుర్కోవడంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. కోరుకొండ మండలం రాజవరం గ్రామ శివారులో ప్రభుత్వ శాఖాధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. ఒడిశాలోని పారా దీప్ నుంచి ప్రారంభమైన పైప్‌లైన్ 1,212 కిలోమీటర్ల మేర ప్రయాణించి హైదరాబాద్ వెళుతుంది. కాగా 808.5 కిలోమీటర్లు వద్ద 3వ స్థాయి ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో భాగంగా ఈ డ్రిల్ నిర్వహించారు. భూమిలో ఉన్న పైప్ నుంచి ఇంధనం లీకేజీ కావడంతో జరిగిన అగ్ని ప్రమాదాన్ని రిక్ టీమ్ ఎదుర్కోవడం, పైప్ లైన్ నుంచి విడుదలైన ఇంధనాన్ని మొస్రు వాహనం ద్వారా తీసుకున్నారు. ప్రమాదానికి గురైన వారిని రక్షించడంతో పాటు మంటలను అదుపు చేయడానికి రెస్క్యూ టీమ్, అగ్నిమాపక శాఖ బృందం, వైద్యులు, అంబులెన్స్ సిబ్బంది సేవలందించడంపై సిబ్బంది డ్రిల్ నిర్వహించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు ఐఓసీఎల్ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు 18004252159కు కాల్ చేయాలన్నారు. డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథ రావు అధ్యక్షతన జరిగిన సభలో ఐఓసీఎల్ చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ 1984లో భోపాల్‌లో జరిగిన గ్యాస్ లీకేజ్ కారణంగా పెద్ద ప్రమాదం జరిగిందన్నారు. నాటినుంచి ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఒడిశాలోని పారాదీప్ నుంచి హైదరాబాద్ వెళ్లే పైప్‌లైన్ ద్వారా పెట్రోలు, డీజిల్ ఏకకాలంలో సరఫరా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్, ఏపీఎస్‌డీఆర్ఎఫ్ ఆర్ఐ వి.రాము, అగ్ని మాపక శాఖ జిల్లా అధికారి మార్టిన్ లూథర్ కింగ్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

రంగంపేట: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పలు గ్రామాల్లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితంలో ముఖ్య ఘట్టాలు భారతీయ జనతా పార్టీ పంచ తీర్థాలు కింద అభివృద్ధి పరచడం, భారతరత్న ఇచ్చి కీర్తించడం, ఆర్టికల్ 370ని రద్దు చేయడం వంటి పార్టీ తీసుకున్న నిర్ణయాలను నాయకులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మైలవరపు సాయిరాం, రంగంపేట గ్రామ మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ దంపతులు పోతుల వీరన్న, దేవి పార్వతి, సుభద్రంపేట సర్పంచ్ కూటి సాయి తాతారావు, సీనియర్ నాయకులు పేపకాయల రామచంద్రరారవు, తోట సూర్యభాస్కరరావు పాల్గొన్నారు.

విమానాశ్రయాన్ని పరిశీలించిన ప్రముఖులు

మధురపూడి: విమానాశ్రయం న్యూ టెర్మినల్ భవనం నిర్మాణంలో జరిగిన ప్రమాద సంఘటనను పరిశీలించడానికి శనివారం పలువురు ప్రముఖులు వచ్చారు. అక్కడ నిర్మాణంలో ఉన్న షెడ్డు శుక్రవారం కూలిన సంగతి తెలిసిందే. మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కలెక్టర్ ప్రశాంతి, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పరిశీలించారు. ఆ పనిని కాంట్రాక్ట్ తీసుకున్న చెన్నైకి చెందిన రెనాటస్ ప్రాజెక్టు ఎండీ మనోజ్ పూనప్పన్, వైస్ ప్రెసిడెంట్ కరుబారకన్, డీజీఎం శరవరణన్ నిర్మాణంలో ప్రమాద సంఘటన విషయమై పలు ప్రశ్నలు వేశారు. ఐఐటీ బృందం పరిశీలించిన తర్వాత వచ్చే నివేదికలో లోపాలున్నట్టయితే చర్యలుంటాయని హెచ్చరించారు. ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



రంగంపేట హైస్కూల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ అనసూయ



బిక్కవోలులో సీనియర్ ఓటర్లను సత్కరిస్తున్న తహసీల్దార్ కృష్ణ



కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

రంగంపేట: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధమని ఓటు హక్కు వినియోగించుకుని సుపరిపాలన స్థాపనకు యువత కార్యోన్ముఖులు కావాలని తహసీల్దార్ కోసు అనసూయ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజకీయ, ఇతర నేతల ప్రలోభాలకు లోను కాకుండా నిస్వార్థంగా ఓటు హక్కు వినియోగించుకుని, సమర్థులైన ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవాల్సిన బాధ్యత యువకులపై ఉందన్నారు. మండలంలో 17 గ్రామాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆయా గ్రామాల రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, ముగ్గుల పోటీలు నిర్వహించి ధ్రువపత్రాలు అందించారు. అనంతరం సీనియర్ సిటిజన్లు పిచ్చుకల అచ్యుత రామయ్య, పోతుల సత్యనారాయణను ఘనంగా సత్కరించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరన్న, ఆర్ఐ ఎస్. గోపిచంద్, గ్రామ రెవెన్యూ అధికారులు కెవివి సత్యనారాయణ, కె.దుర్గ, బత్తిన ఏసయ్య పాల్గొన్నారు.

పాలనలో భాగస్వాములు కావాలి

బిక్కవోలు: ప్రజాస్వామ్య వ్యవస్థలో 18 ఏళ్ల నిండిన ప్రతి పౌరుడూ ఓటు నమోదు చేసుకుని, పరిపాలనా వ్యవస్థలో భాగస్వామి కావాలని తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ అన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ యువత తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు. రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలోని పంచాయతీ కార్యదర్శి రోజా, హెచ్‌ఎం పల్లా ప్రభాకర్, వీఆర్వోలు కొటాని అశోక్, పోతురాజు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: ఓటు వజ్రాయుధం లాంటిదని ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. శనివారం పెదపూడి మండల పరిషత్ పాఠశాలలో, మహాత్మాగాంధీ మెమోరియల్ హైస్కూల్‌లో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు అమ్ముకోవద్దని, సమస్యల పరిష్కారానికి ఓటే ఆయుధమన్నారు. అర్హత కలిగిన వారందరూ ఓటు హక్కు పొందాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లను దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ చిట్టితల్లి, మండల విద్యాశాఖాధికారులు 1,2 కె.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ, వీఆర్వోలు సునీత, నాగేంద్ర, సచివాలయం కార్యదర్శి ఉష పాల్గొన్నారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: కోరుకొండ మండలంలో శనివారం జాతీయ ఓటర్లు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రజావగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు ఈ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సుస్వాగతం మాట్లాడుతూ 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటును హక్కుగా పొందాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఎంఈఓ కుశలవదొర, డిప్యూటీ తహసీల్దార్ సాయిరామ్, ఆర్ఐ రామిరెడ్డి, వీఆర్వో రామకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్, సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో వెదుళ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చిట్టిబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియను సమర్థంగా, సజావుగా నిర్వహించడానికి యువత స్వచ్ఛందంగా ముందుకు కదిలినప్పుడే సార్థకమవుతుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కె.హరే రామకృష్ణ మాట్లాడుతూ యువత ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ భవిష్యత్తును సుస్థిరపరిచే ప్రణాళికతో ఆలోచించుకుని, సరైన నేతలకు తమ ఓటును వేసి దేశ, రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని అన్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు ఎ.వెంకటేష్ యువత ఓటు హక్కును వినియోగించుకుని సమర్థులైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ డీవీ నాగేశ్వరరావు, డాక్టర్ బి.మాధవ్, వీవీ సుబ్బారావు, షేక్ మదీనా, వాణి, మీనాక్షి, దుర్గాప్రసాద్, అలేఖ్య, ఫణీంద్ర కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. డ్రాయింగ్ ఉపాధ్యాయురాలు టి.మాచారమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు సీహెచ్ సంజన, బుల్లి అరుణ, ఎన్.లక్ష్మీప్రసన్న, డి.ప్రసాద్ ఓటర్ల దినోత్సవ లోగోను ముగ్గు రూపంలో వేశారు. ఉపాధ్యాయులు ఉల్లి రామకృష్ణ పాల్గొన్నారు. సీతానగరం ప్రభుత్వ హైస్కూల్లో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించారు. 8 వ తరగతి విద్యార్థి కె.భారతి ముగ్గుల పోటీలు బహుమతి అందుకున్నారు. హెచ్‌ఎం వీరభద్రరావు, ఉపాధ్యాయులు కస్సూరి సతీష్ బాబు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ

రాజానగరం: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం అందించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని గైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జయానంద కుమార్ అన్నారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు, ఓటింగ్ విధానాలపై అవగాహన కలిగిస్తూ విద్యార్థులు పోస్టర్లు తయారు చేసి, ప్రదర్శించారు. ఓటు హక్కును ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వినియోగిస్తానంటూ విద్యార్థులు, అధ్యాపకులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ బి. శ్రీనివాసరాజు, డాక్టర్ ఎస్. గౌరీరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్‌షాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర, అధ్యాపకులు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 7వ తేదీ వరకూ 'రేడియో కెమిస్ట్రీ, రేడియో ఐసోటోప్‌ల అనువర్తనాలు'పై ఐదు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈ మేరకు వర్క్‌షాప్ పోస్టర్లను భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమల లక్ష్మి, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి.గౌరీ నాయుడు సమక్షంలో శనివారం ఆయన విడుదల చేశారు. భౌతిక శాస్త్ర విభాగం నుంచి అధ్యాపక సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రేడియో కెమిస్ట్రీ, ఫిజిక్స్ రంగంలో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు దీని ప్రాముఖ్యతను చెప్పారు. రేడియో కెమిస్ట్రీ, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమ, పర్యావరణ శాస్త్రం వంటి రంగాలలో రేడియో ఐసోటోప్‌ల విభిన్న అనువర్తనాలపై పాల్గొనే వారికి సమగ్ర అవగాహన కల్పించడం దీని లక్ష్యమన్నారు.